క్లుప్తంగా

ఉద్యోగ బెనిఫిట్స్ ఇప్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న చెన్న శ్రీదేవి

నయీంనగర్: తన భర్త చెన్న రాజు కానిస్టేబుల్ (సీపీ నంబర్ 2250)గా పనిచేస్తూ మరణించాడని, ఈక్రమంలో మరణాంతరం వచ్చే బెనిఫిట్స్ ఇప్పించి తమను ఆదుకోవాలని మృతుడి భార్య చెన్న శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన భర్తను బంధువులే హత్య చేశారని, తాను వారిపై కేసు పెడతానంటే పోలీసులు బెదిరించి కేసు పెట్టకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తన భర్త బెనిఫిట్స్‌కు సంబంధించిన సర్టిఫికెట్లు డీపీఓలో ఇచ్చానని, అయినా తనకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. తన భర్త ఉద్యోగం, పెన్షన్, బెనిఫిట్స్ ఇప్పించి తమకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు.

పేద విద్యార్థికి సైకిల్ బహూకరణ



ఖిలా వరంగల్: వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన పేద విద్యార్థి సమీన.. పదో తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియట్‌లో అడుగు పెట్టబోతోంది. ఈమేరకు విద్యార్థినికి వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నరేందర్ సోమవారం ఆర్థిక సాయంతో పాటు సైకిల్‌ను బహూకరించారు. కార్యక్రమంలో కొంత మోహన్, కుమార్, షర్ఫొద్దీన్, సమీనా, చాంద్‌పాషా పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం



వరంగల్: నగరంలోని కొత్తవాడకు చెందిన వడ్లూరి మధుసూదనాచారి కుమార్తె మౌనిక వివాహానికి కావాల్సిన నగదును స్థానిక జీజేఎస్ ఫౌండేషన్ అధినేత, అడ్వకేట్ వెంకటరత్నం తన తల్లిదండ్రుల పేర సోమవారం అందించారు. వివాహ ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని ఆర్థిక చేయూతనందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యెలుగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనం.. మధురానుభూతి




హన్మకొండ కల్చరల్: అమ్మవారి దర్శనంతో మధురానుభూతి కలిగిందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. దేవాలయాన్ని ఆయన సోమవారం సందర్శించగా, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం చేశారు.

పూర్వ విద్యార్థికి సన్మానం



కేయూ క్యాంపస్: ఇండియన్ డ్రగ్ మాన్యుఫాక్చర్ అసోసియేషన్ చైర్మన్‌గా కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి రాజమౌళి ఇటీవల ఎన్నికయ్యారు. ఈమేరకు రాజమౌళిని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం సన్మానించారు. అనంతరం గాదె సమ్మయ్య మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన రాజమౌళి.. అనేక ఆటుపోట్లు ఎదుర్కొని కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగారని కొనియాడారు. రాజమౌళి మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమలకు ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రముఖ స్థానం ఉందని వివరించారు.

సాఫ్ట్‌బాల్‌లో విద్యార్థికి కాంస్యం



వరంగల్: ఏపీ అనంతపురం జిల్లా కేంద్రంలో ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్స్ టోర్నమెంట్ పోటీల్లో వరంగల్ సుందరయ్యనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రచ్చ నర్సింహ ప్రతిభ కనబరిచాడు. ఈమేరకు కాంస్య పతకం సాధించాడు. స్కూల్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో నర్సింహను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర రెడ్డి, పీఈటీ అశోక్‌బాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ సుదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం

వేసవి సెలవులు అనంతరం సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. ఈక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. కాగా, ఎండల కారణంగా విద్యార్థుల హాజరుశాతం తక్కువగా నమోదైందని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖిలా వరంగల్: రైల్వేగేట్ పెరకవాడ పాఠశాలలో ప్రతిజ్ఞకు హాజరైన విద్యార్థులు



సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కవిత, హెచ్‌ఎం



రంగశాయిపేటలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ చందన



కాజీపేట ఆర్‌ఈసీ తండాలో బడిబాట కార్యక్రమంలో కార్పొరేటర్ రాములు, ఉపాధ్యాయులు



శివనగర్ వీధి బాలల పాఠశాలలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సామ్యూల్ జాన్

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించాలి

హన్మకొండ చౌరస్తా: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మర్కజీ స్కూల్ జంక్షన్‌లో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రైవేట్ విద్యాసంస్థల మీద ఉన్న ప్రేమ ప్రభుత్వ పాఠశాలలపై లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మచ్చ పవన్, కళ్యాణ్, మధుగౌడ్, సురేష్, కిరణ్, సాయి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

ఒంటిపూట బడులు నిర్వహించాలి

విద్యారణ్యపురి: తీవ్రమైన ఎండలు, తాగునీటి కొరత కారణంగా ఒంటిపూట బడులు నిర్వహించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా జనరల్ సెక్రటరీ సుదర్శనం ఒక ప్రకటనలో కోరారు.

ప్రజల ప్రాణాలకు రక్షణ కరువు



నిరసన తెలుపుతున్న బక్క జడ్సన్, తదితరులు

మడికొండ: డంపింగ్ యార్డ్‌తో కాజీపేట మండలంలోని మడికొండ, రాంపూర్, అయోధ్యపురం, తదితర గ్రామాల ప్రజలకు రక్షణ కరువైందని ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ అన్నారు. ఈమేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపి, అనంతరం బోర్డు అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కారణంగా చుట్టు పక్కల ప్రజలు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2020లో సుమారు రూ.36కోట్ల వ్యయంతో బయో మైనింగ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటి పరిష్కరించలేదని విమర్శించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

'భవన కార్మికులకు న్యాయం చేయాలి'

ఖిలా వరంగల్: నిజమైన భవన నిర్మాణ కార్మికులకు లేబర్ అధికారులు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఎండీ.యాకూబ్ అధ్యక్షతన ఏఐటీయూసీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, ప్రజా వ్యతిరేకతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల కొట్లాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిన కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సూచించారు. అనంతరం వివిధ కార్మిక సంఘాలకు చెందిన 56 మంది ప్లంబర్ కార్మికులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ నేతృత్వంలో ఏఐటీయూసీలో చేరారు. సమావేశంలో కార్మికులు రాజేందర్, నూతి రమేష్, శివ, సీహెచ్.రాజు, నరేష్, ఊపిరి సమ్మయ్య, రాజన్ బాబు, పాషా, మధు, కృష్ణ, బుజ్జి పాల్గొన్నారు.



సీఐటీయూసీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

వరంగల్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కాశిబుగ్గ: వరంగల్ పాస్టర్స్ సమావేశాన్ని గాంధీనగర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పాస్టర్స్ ఫెలోషిప్‌ను ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫెలోషిప్ అధ్యక్షుడిగా ఎస్.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా యోబు, కోశాధికారిగా విల్సన్, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, ప్రమోద్, సంయుక్త కార్యదర్శులుగా శరత్ బాబు, మిగతా సభ్యులుగా యాకోబ్, ఆదాం, ఆరోగ్యం, అజయ్, మంద కుమార్, అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.


ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

కాశిబుగ్గ: నగరంలోని ప్రభుత్వ భూములను ఇళ్లు లేని నిరుపేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు బాబు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఇళ్లు లేని నిరుపేదలు ఉర్సు, శాయంపేట శివారు ప్రభుత్వ భూముల్లో సోమవారం గుడిసెలు వేస్తుండగా మట్టెవాడ పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వ భూములను అధికారుల సాయంతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ స్థలాల్లో పేదలు గుడిసెలు వేసుకుంటే పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం దారుణమని వాపోయారు. 58 జీఓ ప్రకారం పేదలకు పట్టాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చేవుల శ్రీనివాస్, బాషపాక సంగీత, రంగరాజు విజయ, శివ, హేమలత, రాజమణి, శారద, రమ, రాజమ్మ, స్వరూప ఉన్నారు.



పోలీస్ స్టేషన్‌లో నాయకులు, గుడిసెవాసులు

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న వీసీ రమేష్

నయీంనగర్: దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ వాగ్దేవి కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ ప్రారంభించి మాట్లాడారు. భారీ స్థాయిలో జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగాలు కల్పించడం అభినందనీయం అని ప్రశంసించారు. ఫౌండేషన్ చైర్మన్, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ నిరుద్యోగుల ఆకాంక్ష మేరకు జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. జాబ్ మేళాలో 100కు పైగా కంపెనీలు పాల్గొనగా మొదటి విడతగా 800 మందికి ఉద్యోగాలు కల్పించామని, రెండో దశలో 350 మందికి ఉద్యోగాలు కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శేషాచలం, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాంరాజ్, సతీష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్పీఎఫ్ ఎస్సైపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

కాజీపేట: విధి నిర్వహణలో ఉన్న రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) ఎస్సైపై దాడికి పాల్పడి గాయపర్చిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ అంగడి రాజు అనే ఆర్పీఎఫ్ ఎస్సై ఫాతిమానగర్ బ్రిడ్జి సమీపంలో రైల్వే ట్రాక్‌పై తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ట్రాక్‌పై నిలబడి మద్యం సేవిస్తున్నారు. రైళ్లు వచ్చే సమయం అయిందని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించగా ఆగ్రహంతో వారు డ్యూటీ డ్రెస్‌లో ఉన్న ఎస్సైపై దాడి చేసి గాయపర్చారు. ఎస్సై సెల్‌ఫోన్ ధ్వంసం చేశారని సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

వరంగల్: ఏనుమాముల పోలీసుస్టేషన్ పరిధిలోని 14వ డివిజన్ బాలాజీనగర్‌లో సోమవారం సాయంత్రం విద్యుదాఘాతంతో ఒక వ్యక్తి మృతి చెందినట్లు తెలిసింది. ఈవిషయమై ఏనుమాముల పోలీసులను విచారించగా ప్రమాదం జరిగింది వాస్తమే అని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

సంక్షిప్తంగా

డ్రైవర్ల డిమాండ్లు నెరవేర్చండి

నయీంనగర్: కార్మిక చట్టాల ప్రకారం డ్రైవర్లు, క్లీనర్లకు వేతనం, న్యాయం జరిగేలా విద్యాసంస్థల యజమాన్యాలు చూడాలని తెలంగాణ ఓరుగల్లు ప్రైవేట్ విద్యాసంస్థల బస్ డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొడ్డిపాటి సారయ్య డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లకు రూ.21 వేలు, క్లీనర్లకు రూ.12వేల చొప్పున జీతంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, 12నెలల వేతనం, ఒక నెల బోనస్ వేతనం, సెలవులు, ఇద్దరు పిల్లలకు ఉచిత విద్య, అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వాలన్నారు.

ప్రముఖ న్యాయవాది పేర గోల్డ్‌మెడల్

కేయూ క్యాంపస్: హనుమకొండకు చెందిన ప్రముఖ న్యాయవాది దివంగత కొలిపాక ప్రకాశ్‌రావు శతజయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు.. కాకతీయ యూనివర్సిటీలోని న్యాయ శాస్త్రవిభాగంలో గోల్డ్‌మెడల్‌ను ప్రతిపాదించారు. అందుకు సంబంధించిన రూ.3 లక్షల చెక్‌ను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావుకు సోమవారం అందజేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కాజీపేట: నిబంధనలను అతిక్రమించి ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వందమంది వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు సోమవారం ఈ–చలాన్ నమోదు చేయడంతో పాటు పెండింగ్ చలాన్లను వసూలు చేశారు. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. హెల్మెట్, వాహన కాగితాలు లేకుండా తిరుగుతున్న వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించి మరోమారు ఇలా జరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

17న మంత్రి కేటీఆర్ పర్యటన

వరంగల్ చౌరస్తా: ఈనెల 17న మంత్రి కేటీఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోరారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని బాపూజీ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగిన 27వ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్‌టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన ఉన్నందున భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించాలని సూచించారు. అలాగే, భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

భక్తులకు దద్దోజనం, మజ్జిగ పంపిణీ

హన్మకొండ చౌరస్తా: జ్యేష్ఠ బహుళ సోమవారాన్ని పురస్కరించుకుని చారిత్రక వేయిస్తంభాల ఆలయ ఆవరణలో వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు దద్దోజనం, మజ్జిగ, స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ హాజరై ప్రసాదం అందజేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు సేవా కార్యక్రమాలు చేయడం హర్షణీయం అని కొనియాడారు. ధూప, దీప, నైవేద్య పథకంలో వీరశైవులకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ జిల్లా అధ్యక్షుడు నానం రాజయ్య, ప్రధాన కార్యదర్శి విధుమౌళి, కోశాధికారి సురేష్, ఈశ్వరయ్య, సర్వేశ్వర్, మఠం బసవయ్య, సంఘం మహిళా అధ్యక్షురాలు శైలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 42వ డివిజన్ రంగశాయిపేటకు చెందిన బజ్జూరి ఉపేంద్ర, కొండోజు వెంకటనారాయణ, ఉర్సు ప్రాంతానికి నర్మెట్ట సీతమ్మ ఇటీవల మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను మేయర్ గుండు సుధారాణి సోమవారం పరామర్శించారు. వారి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మేయర్ వెంట గుండు పూర్ణచందర్, దామెరకొండ కరుణాకర్, ముత్తినేని రామ్మూర్తి, బజ్జూరి వాసు, ఆవునూరి రామ్మూర్తి, అజ్మీర్, బత్తిని నరేందర్ తదితరులున్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ రిజిస్టర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌రావును సోమవారం కలిసి సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ కన్వీనర్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, నాయకులు జె.చందులాల్, మధుకర్‌రావు, చీకటి శ్రీనివాస్, బ్లెస్సీ ప్రియాంక్, తదితరులు పాల్గొన్నారు.

సినారెకు నివాళి

హన్మకొండ: తెలంగాణ సాహితీ సౌరభాలను జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, సాహితీవేత్త డాక్టర్ సి.నారాయణ రెడ్డి విశ్వవ్యాపితం చేశారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి గుర్తుచేశారు. ఈమేరకు సినారె వర్ధంతిని హనుమకొండలోని హనుమాన్‌నగర్ –1లో సాహితీవేత్త సోమవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు మొట్ల శ్రీనివాస్, సిరిమల్లె ప్రవీణ్, కుమార్ రెడ్డి, చిర్ర శ్రావణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, సాంబమూర్తి, విజేందర్, రవి కిరణ్, సుమన్ పాల్గొన్నారు.

లక్ష పూల అలంకరణలో మల్లన్న

కాజీపేట: బహుళ నవమిని పురస్కరించుకుని కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ సమీపంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు సోమవారం ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో మల్లికార్జునుడితో పాటు భ్రమరాంబిక మాతకు పంచామృతాలతో పాటు నదిజలాలతో అభిషేకం జరిపించారు. అనంతరం దేవతామూర్తులకు లక్షపూలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

దళితుల అభ్యున్నతికి వారణాసి స్వామి కృషి

హన్మకొండ: దళితుల అభ్యున్నతికి కృషి చేసిన సామాజిక ఉద్యమకారుడు వారణాసి స్వామి అని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సోమవారం కార్యక్రమంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన వారణాసి స్వామి చిత్ర పటానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈనెల 14న మధ్యాహ్నం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని వారణాసి స్వామి స్వగృహం వద్ద యాది సభ, దశదినకర్మ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మంచాల వెంకటస్వామి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బండి అశోక్, ఆయా సంఘాల నాయకులు రాజేశ్వరరావు పటేల్, దండు మోహన్, పాండుగుల నర్సయ్య, సాధు కుమారస్వామి, జక్కుల నరసయ్య పి.కృష్ణ స్వామి, మేడ రంజిత్ కుమార్, గడ్డం ప్రవీణ్, జెట్టి విక్రమ్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి

కాశిబుగ్గ: ఎల్‌బీ కళాశాల విద్యార్థులపై దాడులకు పాల్పడిన భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలకు సంబంధించిన భూమిలో యాదిలాల్, అతని అనుచరులు అక్రమ నిర్మాణం చేస్తుండగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు అడ్డుకున్నారని తెలిపారు. దాంతో యాదిలాల్‌కు చెందిన హరీష్, అతని అనుచరులు.. విద్యార్థులపై సోమవారం దాడులు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

కాజీపేట రూరల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని సహాయ లేబర్ కమిషనర్ కోలా ప్రసాద్ సూచించారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా బాల కార్మిక నిర్మూలన సంస్థ, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్, బచ్పన్ బచావో ఆందోళన్, కార్మికశాఖ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ పోలీస్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో కాజీపేట జంక్షన్ రైల్వే పరిసర ప్రాంతంలో సోమవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బాల కార్మిక నిర్మూలన సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సీఐలు ఎం.సంజీవ, ఎం.రాంమూర్తి, ప్రతినిధులు బుర్ర అశోక్ కుమార్, కె.శిరీష, సంతోష్‌కుమార్, మౌనిక, ప్రవీణ్‌కుమార్, సతీష్‌కుమార్, రాగి కృష్ణమూర్తి, జీఆర్పీ ఎస్సై పరశురాం, ఏహెచ్‌టీయూ ఎస్సై షఫియొద్దీన్, యాకూబ్‌పాషా, రంజిత్, చాణక్య, వినోద్ కుమార్, జి.సునీత, చైతన్య, మాధవి, విజయ్‌కుమార్, శృతి, జ్ఞానేశ్వరి, రవికృష్ణ పాల్గొన్నారు.

నడక, వ్యాయామంతో ఆరోగ్యం



టీఎస్ఎస్పీ బెటాలియన్‌లో 2కే రన్



2కే రన్ విజేతలతో ఏనుమాముల ఇన్‌స్పెక్టర్

మామునూరు: స్పెషల్ పోలీసులు రోజు ఉదయాన్నే వ్యాయామంతోపాటు నడవడం, పరిగెత్తడం చేస్తే మరింత ఆరోగ్యంగా ఉంటారని టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ సింధుశర్మ సూచించారు. మామునూరులోని టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ పరిపాలన విభాగం అధికారుల ఆధ్వర్యంలో స్పెషల్ పోలీసుల 2కే రన్, సాంస్కృతిక కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, ఐదో బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ చటర్జీతో కలిసి 2కేరన్‌ను ప్రారంభించి మాట్లాడారు. అడిషనల్ కమాండెంట్ పెద్ద బాబు, అసిస్టెంట్ కమాండెంట్ రాంబాబు, పీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, రమేష్, ఆర్‌ఐలు చంద్రన్న, కార్తీక్, చంద్రశేఖర్, ఆర్ఎస్సైలు దశరథం, పీఆర్‌ఓ రామాచారి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో యువత ముందుండాలి


వరంగల్: యువత అన్ని రంగాల్లో ముందుండాలని, సమాజ సేవపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ సూచించారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గం కేంద్రంలో సోమవారం నిర్వహించిన 2కే రన్‌లో 10మందిని విజేతలుగా గుర్తించి జిల్లా యంత్రాంగం సన్మానించింది.

ఆ స్థలం మాదే..

- స్థల యజమాని చుంచు నర్సింహామూర్తి

హన్మకొండ: హనుమకొండ హనుమాన్ నగర్‌లోని హనుమాన్ ఆలయం పక్కన ఉన్న స్థలం తమదేనని, స్థలంపై సర్వహక్కులు తమకే ఉన్నాయని, కోర్టు కూడా తీర్పు ఇచ్చిందని స్థల యజమాని, వరంగల్ శివనగర్‌కు చెందిన చుంచు నర్సింహామూర్తి స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం హనుమకొండ బాలసముద్రంలో 'క్రా కన్సల్టెన్సీ' ప్రతినిధి, బిల్డర్ ఎం.ప్రహ్లాద్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022 మేలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అధికారులు అనుమతిచ్చారన్నారు. అపార్ట్‌మెంట్ పనులు మొదలు పెట్టగానే ఈ స్థలం దేవాలయానికి చెందినది అంటూ బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ.. తన అనుచరులతో వచ్చి నిర్మాణాలను ధ్వంసం చేశారన్నారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. న్యాయంగా తాను కొనుగోలు చేసిన స్థలంపై దౌర్జన్యం చేయడం రావు పద్మకు తగదన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మాంటిస్సోరి ప్రైమ్ స్కూల్ చైర్మన్ జోస్ నెడుతుండమ్ అన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల సోమవారం పునఃప్రారంభమైంది. విద్యార్థులు ఉత్సాహంతో కేరింతలు కొడుతూ పాఠశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రమశిక్షణతో విద్యా సంవత్సరం పూర్తి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమలో పాఠశాల ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.